క్లుప్తంగా

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 31 చివరి తేదీ అని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 30 మంది బాలురు, 30 మంది బాలికలు మొత్తం 60 సీట్లు ఉన్నాయన్నారు. ఎస్టీ విద్యార్థులు మాత్రమే అర్హులని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమాండెంట్ హేమంత్‌కుమార్

చింతూరు: సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా సీఆర్పీఎఫ్ జీ-141 బెటాలియన్ ఆధ్వర్యంలో అల్లిగూడెంలో గురువారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన 16 జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా అల్లిగూడెం ఏ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ హేమంత్‌కుమార్ శర్మ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పేగ ఎంపీటీసీ సభ్యుడు సున్నం నాగరాజు, సర్పంచ్ పాయం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ భర్త మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు

చింతపల్లిరూరల్: స్థానిక వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు-2 చిందాడ జయలక్ష్మి భర్త చిందాడ సత్యనారాయణ అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు గ్రామాన్ని సందర్శించి, సత్యనారాయణ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జయలక్ష్మి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. చింతపల్లి, జీకే వీధి ఎంపీపీలు అనూషదేవి, బోయిన కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, మండల పార్టీ అధ్యక్షులు మోరి రవి, బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్ రమేష్ నాయుడు తదితరులు నివాళులర్పించారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఎటపాక: మండలంలోని ఎర్రబోరు గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎటపాక పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ 2వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ రామారావు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా పేకాట, కోడిపందాలు, ఇతర జూదాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సారా స్వాధీనం- ఒకరి అరెస్టు



సారా తరలిస్తున్న నిందితునితో ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది

జి.మాడుగుల: అక్రమంగా సారా తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ చెప్పారు. ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.మాడుగుల-చింతపల్లి మార్గంలో గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, గ్రామం వైపు అనుమానస్పదంగా వెళ్తున్న గాంధీనగం గ్రామానికి చెందిన జనుగూరు పూర్ణారావును తనిఖీ చేయగా, 20 లీటర్ల సారాను గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ చెప్పారు.

ఊరు మారింది

కిముడుపల్లిలో ప్రగతి పరుగులు

- సచివాలయంతో తీరిన కష్టాలు
- అందుబాటులో సెల్ సేవలు
- గ్రామాలకు తారురోడ్ల సదుపాయం
- గిరిజనుల ఆనందం



పులిగొంది తారురోడ్డు నిర్మాణం



కిముడుపల్లలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల భవనం



కిముడుపల్లిలో సచివాలయ భవనం

పెదబయలు: నాడు గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులు గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల దూరంలో ఊటగెడ్డలను ఆశ్రయించేవారు.. అధ్వాన రహదారులతో అవస్థలు పడ్డారు. ప్రభుత్వ సేవలందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి పనికి జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులకు లంచాలు ఇవ్వాల్సి వచ్చేది...అదంతా గతం...నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో శివారు ఆదివాసీ గ్రామాలు కూడా అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నాయి. గ్రామ సచివాలయం, గ్రామ వలంటీర్ వ్యవస్థతో గిరిజనుల చెంతకే ప్రభుత్వ సేవలు ఎటువంటి మధ్యవర్తిత్వం లేకుండా అందుతున్నాయి. దీంతో గిరిజనులంతా హర్షం వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఆదర్శం కిముడిపల్లి పంచాయతీ

మండలంలోని కిముడుపల్లి పంచాయతీ పరిధిలో 23 గ్రామాలు ఉండగా అందులు రెండు మినహా మిగిలినన్నీ పీవీటీజీ గ్రామాలున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకులు ఈ ప్రాంత అభివృద్ధిపై కనీసం పట్టించుకోలేదు. మచ్చుకైనా చిన్నపాటి అభివృద్ధి పనులు కూడా చేయలేదు. దీంతో ఆదివాసీలు నానా అవస్థలు పడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత గిరిజన గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించారు. దీంతో పంచాయతీ స్వరూపం మారి సంక్షేమ బాటలు పడ్డాయి. పంచాయతీ కేంద్రంలో గ్రామ సచివాలయం ద్వారా అందరికీ ప్రభుత్వ సేవలందుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని డీబీటీ ద్వారా 2618 మంది లబ్ధిదారులకు రూ.10,50,62,624 కోట్ల నిధులు నేరు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమచేసింది. దీంతో ప్రతీ కుటుంబం మళ్లీ మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని కోరుతున్నారు. గ్రామానికి గతంలో అధ్వాన గ్రావెల్ రోడ్డు ఉండేది. నేడు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పాడేరు మండలం గుత్తుల పుట్టు నుంచి అరడగూడెం వరకు సుమారు రూ.18 కోట్లతో తారురోడ్డు నిర్మించారు. దీంతో పాడేరు వెళ్లేందుకు దూరాభారం తగ్గిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంచాయతీలో ఒక్క గ్రామానికి సెల్ సంకేతాలు అందుబాటులో ఉండేవి కావు. నేడు పంచాయతీలో వనభరింగిలో జీయో టవర్, బంగారుమామిడిలో ఎయిర్‌టెల్, కిముడుపల్లిలో బీఎస్ఎన్ఎల్ టవర్లు నిర్మాణం జరిగింది.

కిముడుపల్లి పంచాయతీలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు మంజూరైన నగదు

పథకం	లబ్ధిదారులు	జమ అయిన నగదు
అమ్మఒడి	446	రూ.21,32,4000
వైఎస్సార్ ఆసరా	36	రూ.1,50,885
జగనన్న వసతి దీవేన	51	రూ.7,69,060
జగనన్న విద్యా దీవెన	220	రూ.29,65,695
వైఎస్సార్ పెన్షన్లు	392	రూ.37,40,4000
రైతు భరోసా	965	రూ.3,44,56,000
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	12	రూ.6,29,984
వైఎస్సార్ బీమా	7	రూ.14,13,333
వైఎస్సార్ చేయూత	142	రూ.56,00,000

శివారు గ్రామాల్లో అభివృద్ధి



పంచాయతీకి సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే మా పంచాయతీకి సంక్షేమ బాటలు పడ్డాయి, తారురోడ్ల నిర్మాణంతో రవాణా మెరుగుపడింది. సీఎం జగనన్న డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో కోట్లాది రూపాయలను నేరుగా నిధులు జమ చేశారు. ఐదు సెల్ టవర్ల నిర్మాణం జరిగింది. ప్రతీ గ్రామానికి తాగునీరు, నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. కరోనాతో రెండేళ్ల కష్టాల్లోనూ ఇంత అభివృద్ధి చేశారు. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకుంటాము.

– కొర్రా సుధారాణి, సర్పంచ్, కిముడుపల్లి

తక్కువ కాలంలోనే అభివృద్ధి



కిముడుపల్లి పంచాయతీ తక్కువ కాలంలోనే ఎక్కువ అభివృద్ధి సాధించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకులు ఈ పంచాయతీ అభివృద్ధిని విస్మరించారు. నేడు జగనన్నతోనే అభివృద్ధి సాధ్యమైంది.ప్రతీ కుటుంబం సంతోషంగా ఉన్నాం. జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా అందరికీ అన్ని పనులు సక్రమంగా జరుగుతున్నాయి. ఒకటో తేదీ నాటికి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి మంజూరైన పింఛన్లు పంపిణీ జరుగుతుంది. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా రావాలి.

– వంతాల అప్పారావు, కిముడుపల్లి

'రన్ ఫర్ జీసస్' రేపు

పాడేరు రూరల్(హుకుంపేట): గుడ్‌ఫ్రైడే, ఈస్టర్‌ల సందర్భంగా శనివారం పాడేరు పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పాడేరు పాస్టర్ల సంఘం ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7 గంటలకు పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రారంభమయ్యే రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో క్రైస్తవులంతా పాల్గొవాలని వారు కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి, అప్పలరాజుపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో సురేష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 3వేల కుటుంబాలకు 100 రోజుల పని కల్పించినట్టు చెప్పారు. మండల వ్యాప్తంగా 12వేల జాబ్‌కార్డులు ఉండగా ప్రస్తుతం 8,400 మంది వేతనదారులు పనులకు వస్తున్నారన్నారు. ఈనెలాఖరుకు 6.50లక్షల పనిదినాల లక్ష్యం పూర్తి చేయనున్నట్టు తెలిపారు. పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



బోల్తా పడిన ఆటో, ఎజీక్స్ బండి

చింతపల్లిరూరల్: మండలంలో అంతర్ల వద్ద కాంక్రీట్ ఎజీక్స్, ఆటో ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం ఎన్‌హెచ్-516 రహదారులు పనుల్లో భాగంగా కాంక్రీట్ నింపుకోని కాంక్రీట్ ఎజీక్స్ బండి వెళ్తూ, ఎదురుగా వచ్చిన ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ జార్కండ్ రాష్ట్రనికి చెందిన అజిత్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతని అంబులెన్స్‌లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యులు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

జగనన్నతోనే సంక్షేమం



రంపలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం/మారేడుమిల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందాయని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. మారేడుమిల్లి మండలం డి.వి.కోట, వైదపూడి, రంపచోడవరం మండరం బూసిగూడెం, చిలకమామిడి, రంప గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డి.వి.కోట గ్రామంలో ఎన్నిక ప్రచారంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని రాజకీయ పార్టీలు కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన్న ఉన్నారన్నారు.పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వం దేశంలో ఒకే ఒక్క ప్రభుత్వం అదీ జగనన్న ప్రభుత్వామన్నారు. రంపలో జరిగిన ఎన్నిక ప్రచారంలో మాట్లాడుతూ ఎన్నికలు వచ్చాయి కాబట్టి చంద్రబాబునాయుడు మోసపూరిత హామీలు ఇస్తారన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలుచేసిన దాఖలాలు లేవన్నారు. కుట్ర రాజకీయాలు చేస్తున్న టీడీపీ కూటమికి తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమం, అభివృద్ధి చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకుందామన్నారు. రంప గ్రామంలో టీడీపీ నాయకులు రెడ్డి తదితరులు ఎమ్మెల్యే ధనలక్ష్మీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆమె పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీలు బందం శ్రీదేవి, సార్ల లలితాకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు జల్లేపల్లి రామన్నదొర, సత్తి సత్యనారాయణరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్లు పండా రామకృష్ణదొర, గొర్లె అనిల్(బాబి), సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య, చెదల దేవి, బి.సోమాలమ్మ, వడగల ప్రసాద్, రమేష్‌దొర, కో-ఆప్షన్ మెంబరు షేక్ వలీ, ఏఎంసీ డైరెక్టర్ దూడ స్మిత్, నాయకులు కుమార్, సుధీర్, శేఖర్, కొండ్రాజు, రాంబాబు, ఉప సర్పంచ్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే అందరి లక్ష్యం



మాట్లాడుతున్న పాడేరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు శ్రీకాంత్‌రాజు, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు



కిల్లోగుడలో గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యలింగం



ఎమ్మెల్సీ అనంతబాబుకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించిన ఎంపీ అభ్యర్థిని తనూజారాణి, భర్త శెట్టి వినయ్

జి.మాడుగుల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు అధ్యక్షతన ముఖ్య నాయకులతో గురువారం జరిగిన సమావేశంలో పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పాడేరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు, నాయకులు, కార్యకర్తలు శక్తి వంచనలేకుండా పనిచేయాలని కోరారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పరిపాలనలో ప్రజలకు జరిగిన మేలు, చేపట్టిన అభివృద్ధిని ప్రతి గడపకు వెళ్లి వివరించాలన్నారు. గిరిజనులంతా వైఎస్సార్‌సీపీకి అండగా ఉండి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాడేరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ భారీ విజయానికి క్లస్టర్ విధానం ఎంతో దోహదపడుతుందన్నారు. మండలంలో 17పంచాయతీలను ఆరు క్లస్టర్లుగా విభజించి క్లస్టర్లు ఇన్‌చార్జీలను నియమిస్తున్నట్టు తెలిపారు. మొదటి క్లస్టరులో కిల్లంకోట, బొయితిలి, నుర్మతి, భీరం పంచాయతీలు, రెండో క్లస్టర్‌లో వంతాల, గడుతూరు, సొలభం, పెదలోచలి పంచాయతీలు, మూడవ క్లస్టర్‌లో జి.మాడుగుల, పాలమామిడి పంచాయతీలు, నాల్గవ క్లస్టర్‌లో వంజరి, గెమ్మెలి, అయిదవ క్లస్టర్‌లో పెదలువ్వాసింగి, సింగర్భ, కోరాపల్లి, ఆరో క్లస్టర్‌లో కె.కోడాపల్లి, కుంబిడిసింగి పంచాయతీలు ఉన్నాయి. పార్టీ విజయమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీ కూడా సురేష్‌కుమార్, జీకే వీధి మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, జేసీఎస్ మండల కన్వీనర్ ఎల్.కళ్యాణం, ఎంపీటీసీ సభ్యులు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, పాంగి లక్ష్మీ, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు, సీదరి కొండబాబు, బి.చినకుమారి, కె.రామకృష్ణ, ట్రైకార్ డైరెక్టర్ ఎస్.లోవరాజు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు రామకృష్ణ, అంద్రయ్య, జిల్లా విద్యార్థి విభాగ కార్యదర్శి మాతే వెంకటేష్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు నాగూర్‌బాబు, మహిళా మండల అధ్యక్షురాలు నీలమ్మ, నాయకులుమత్స్యరాజు,గంగరాజు, మాలన్న, సోమలింగం, పండన్న,పండుదొర, శేఖర్, చిట్టిబాబు దేముళ్లనాయుడు పాల్గొన్నారు.



గుమ్మలో పర్యటిస్తున్న నాయకులు

డుంబ్రిగుడ (అరకులోయటౌన్): రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీకి ప్రజలంతా అండగా నిలవాలని అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం కోరారు. మండలంలోని సాగర పంచాయతీ కిల్లోగుడ, కుసుమగుడ, బలియగుడ, సాగర ప్రాంతాల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లు అన్ని వర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలుచేయడంతో పాటు సుపరిపాలన అందించిన సీఎం జగనన్నకు అందరూ అండగా నిలవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని అభ్యర్థించారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరరావు, జిల్లా పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు బురిడి లీలారాణి, జగనన్న అసెంబ్లీ కన్వీనర్ కూడా పాపారావు, వైస్ ఎంపీపీలు పంచాడి లలిత, శెట్టి ఆనందరావు, నాయకులు గణపతి, సింహాచలం, కృష్ణారావు, నగేష్ మోహన్, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని గుమ్మ పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి ఆధ్వర్యంలో మేము సిద్ధం ..మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా నాయకులు గ్రామంలో పర్యటించి జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రధాన కార్యదర్శి శెట్టి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు సూర్యానారయణ, ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి గంగరాజు, జేసీఎస్ కన్వీనర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీల: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంతబాబుని వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థిని గుమ్మా తనూజారాణి మండలంలోని ఎల్లవరంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయంపై చర్చించుకున్నారు. ఎంపీ అభ్యర్థిని తనూజారాణి వెంట ఆమె భర్త పార్టీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, రుడకోట సర్పంచ్ కతారి సురేష్‌కుమార్ ,అడ్డుమండ సర్పంచ్ గుమ్మా శ్యామ్‌సుందర్ తదితరులున్నారు. అడ్డతీగలలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఎమ్మెల్సీ అనంతబాబు ఎన్నికల ప్రచారం చేపట్టనున్నట్టు మండల పార్టీ కన్వీనర్ వీర్రాజు తెలిపారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

గంగవరం : ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సత సులోచన చెప్పారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరానికి చెందిన కళాజాత బృందం ద్వారా గురువారం మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ సత్య సులోచన, డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రరావు, రాంబాబు, ఆర్ఐ జిలానీ బాషా, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలోని గొంటువానిపాలెం, కిమ్మూరు, పులిగోగులపాడు గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది మోహనరావు దొర, వీఆర్వోలు తదితరులు పర్యటించి, గ్రామస్తులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.

కోతి దాడిలో వ్యక్తికి గాయాలు



గాయపడిన వృద్ధుడు అంజిబాబు

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి కూడలి వద్ద సిమ్మెంట్ బెంచిపై కూర్చొని ఉన్న అంజిబాబు (63) అనే వృద్ధునిపై గురువారం రాత్రి కోతి దాడి చేయగా గాయపడ్డాడు. అతను ముందుకు పడిపోవడంతో మణికట్టు వద్ద కుడి చేయి విరిగింది. అతనిని స్థానికులు స్థానిక పీహెచ్‌సీకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. స్థానికంగా ఓ దుకాణంలో రోజు వారి కూలీగా పనిచేస్తున్న అంజిబాబు ఒంటరిగానే జీవిస్తున్నాడు. స్థానికులు కొంత ఆర్థిక సహాయం అందజేసి ధైర్యం చెప్పారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

మునగపాక: చూచుకొండ గ్రామంలో గురువారం నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు)తో పాటు పలు పార్టీలకు చెందిన వారు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు.

వైభవంగా పైడిమాంబ ఆలయం ప్రారంభం



ఆలయంలో భక్తులు

రాంబిల్లి: మామిడివాడలో గురువారం పైడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఆలయం ప్రారంభోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. యలమంచిలి యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబు), ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు. ధర్మశ్రీ అమ్మవారి ఆలయం వద్ద రూ 50 లక్షలు ఎంపీ ల్యాడ్స్ మంజూరు చేయించారు. దీనికి తోడు దాతల విరాళాలతో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఆలయం ప్రారంభం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా భజనలు , కోలాటాలు, అన్న సమారాధన నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, రాంబిల్లి, యలమంచిలి ఎంపీపీలు జి.శిరీషశ్రీనుబాబు, బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, కిషోర్, గ్రామ పెద్దలు సత్యనారాయణ, నాగరాజు, రమణారావు, రాఘవేంద్ర పాల్గొన్నారు.